భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుక

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు/జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 20 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంతోపాటు, జడ్చర్లలో ఈస్టర్ ఆరాధన వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కల్వరీ కొండపై జరిగిన ఈస్టర్ వేడుకలకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈస్టర్ పండుగను మీ అందరితో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కల్వరీ కొండపై దశల వారీగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా యునైటెడ్ క్రిస్టియన్స్ ఆధ్వర్యంలో జడ్చర్లలోని క్రైస్తవులు సామూహిక ఈస్టర్ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని కల్వరిగుట్టపై క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు సీజే బెనహర్, చిన్నరాజు, క్రిస్టియన్ మైనారిటీ పట్టణాధ్యక్షుడు శ్యాముల్‌దాసరి, జాజిమొగ్గ నర్సింహులు, పాస్టర్ వరప్రసాద్, జాకబ్, ఎమ్యాన్యుల్‌రాజు, స్టీఫెన్, టైటస్ రాజేంద్ర, రవికుమార్, రాజశేఖర్, పాస్టర్ విలియం బూత్, ఫిలిమోన్, తిమోతి, జైపాల్, నిత్యానందం, లూథర్ పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

జడ్చర్ల/జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 20 : మండలంలో అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. జడ్చర్ల అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో వారంరోజులపాటు అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు, కంపనీలు, విద్యాసంస్థల్లో, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్నిప్రమాదాలను ఎలా రక్షించుకోవాలనే విషయాలను క్షేత్రస్థాయిలో డెమోద్వారా తెలియజేశారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని జడ్చర్ల అగ్నిమాపక శాఖాధికారి రాజేందర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం జడ్చర్లలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు చేపట్టాలో ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో జడ్చర్ల స్టేషన్ ఫైర్ అధికారి రాజేందర్, టీడింగ్ ఫైర్ మ్యాన్ రాఘవేందర్, లక్ష్మికాంత్‌రెడ్డి, డ్రైవర్, ఆపరేటర్లు సురేశ్, వెంకటేశ్, నవీన్ కుమార్, రాజేశ్ పాల్గొన్నారు.

నేడగం దొడ్డిలో రోడ్డుపై చెత్తపారేసి అక్కడే అంటి పెడుతున్న కార్మికులు

మూలన పడ్డ పంచాయతీ ట్రాక్టర్

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- నిర్వహణ లేక మూలనపడ్డ పంచాయతీ ట్రాక్టర్లు
- రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పేరుకుపోతున్న చెత్తాచెదారం
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పల్లెల్లో పారిశుధ్యం లోపించి అస్తవ్యస్తంగా మారాయి. వీధుల్లో చిన్నగుంత ఏర్పడినా పూడ్చేవారే కరువయ్యారు. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతున్నది. ఈగలు, దోమల, పందుల బెడద పెరిగి వ్యాధులు విజృంభిస్తున్నాయి.

నేడగం దొడ్డిలో మురుగు కాల్వలో పేరుకుపోయిన చెత్త

మాగనూరు, ఏప్రిల్ 20: నిత్యం వీధులను పరిశుభ్రం చేయాల్సిన పారిశుధ్య సిబ్బంది, పంచాయతీ అధికారులు పట్టించుకోక పోవడంతో పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. పల్లెలంతా అపరిశుభ్రంగా మారుతున్నాయి. పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలంటే డీజిల్ అవసరం. కానీ డీజిల్ వాటి మరమ్మతుకు నోచుకోక పోవడంతో వాటి నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో ట్రాక్టర్లను నిలిపివేయడంతో ఎక్కడి ట్రాక్టర్లు అక్కడే ఉన్నాయి. దీంతో చెత్తలో పందుల సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మాగనూరు మండలంలోని నేడగం దొడ్డి, తలంకేరి గ్రామాల్లో వీధులు అపరిశుభ్రంగా మారాయి. పారిశుధ్య కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టినా చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకు పోవడంతో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేయక పోవడంతో నిర్వహణ కష్టతరమవుతుందని పంచాయతీ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే లక్షలు చేతి నుంచి ఖర్చు పెట్టుకున్నా ప్రభుత్వం నిధులను జమచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఈ విషయంపై ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శులను వివరణ కోరగా పంచాయతీలో నిధులు లేక పోవడంతో చెత్త తరలింపును నిలిపివేసిన మాట వాస్తవమే అని అన్నారు. వీధుల్లో పారిశుధ్య పనులు నిరంతరం చేపడుతున్నామన్నారు. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దేశభక్తిని అలవర్చుకోవాలి

బాలానగర్ (రాజాపూర్), ఏప్రిల్ 20 : యువత ఛత్రపతి శివాజీ దేశభక్తిని అలవర్చుకోవాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. ఆదివారం రాజాపూర్ మండలం చెన్నమ్మపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ నాయకత్వం ప్రారంభమైంది మొదలు యువత ఆలోచనా విధానం మారిపోయిందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎంపీ అరుణను సన్మానించారు.

ప్రజావాణి రద్దు

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 20 : పేట జిల్లాలో భూ భారతి కార్యక్రమాలు జరుగుతున్నందున కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం లేదని పేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు, రైతులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

ప్రారంభమైన ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ పరీక్షలు

నారాయణపేట రూరల్, ఏప్రిల్ 20 : ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎస్సెస్సీ పరీక్షలకు గానూ మూడు పరీక్ష కేంద్రాలు, ఇంటర్‌కు గానూ నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈవో గోవిందరాజులు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌లు తెలిపారు. ఎస్సెస్సీ పరీక్షలకు గానూ 508మంది అభ్యర్థులను అలాట్ చేయ్యగా 435 మంది పరీక్షలకు హాజరు కాగా, 73 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 769 మంది అభ్యర్థులను అలాట్ చేయ్యగా 709 మంది పరీక్షలకు హాజరు కాగా, 60 మంది గైర్హాజరయ్యారు.

మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలి

నిరసనలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

నారాయణపేట, ఏప్రిల్ 20 : తెలంగాణలో మే 7 నుంచి 30 వరకు జరిగే 72వ మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరీ డిమాండ్ చేశారు. ఆదివారం పీవోడబ్ల్యూ, ఐద్వా, పీవైఎల్, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి మున్సిపల్ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించి పార్కు వద్ద నిసరన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిస్ వరల్డ్ పోటీల్లో 120 దేశాల నుంచి మహిళా ప్రతినిధులు పాల్గొంటారని, ఇది గర్వించదగినవి, ఆనందించవల్సిన విషయం ఏమాత్రం కాదన్నారు. అందాల పోటీలకు ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు పెడుతుందని, ప్రజలకు ఏమాత్రం అవసరంలేని మరింత భారం పెంచే అందాల పోటీలు నిర్వహించడం సరైంది కాదన్నారు. బహుళజాతి కంపెనీల లాభాల కోసం నిర్వహించే ఈ అందాల పోటీలు స్త్రీల వ్యక్తిత్వాన్ని, గౌరవాన్ని దిగజారుస్తున్నాయన్నారు. తెలంగాణ ప్రజలందరూ ఈ పోటీలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు సాయికుమార్, నరహరి, సౌజన్య, లక్ష్మి, నమ్రీన్ భేగం, నర్సింహా పాల్గొన్నారు.

వరంగల్ సభను విజయవంతం చేయాలి

చౌడూర్‌లో వాల్‌రైటింగ్స్ రాయిస్తున్న నాయకులు

నవాబ్‌పేట, ఏప్రిల్ 20 : బీఆర్ఎస్ రజతోత్సవాల్లో భాగంగా ఈనెల 27వ తేదీన ఎల్కతుర్తిలో నిర్వహించతల పెట్టిన బహిరంగసభను విజయవంతం చేయాలని చౌడూర్ బీఆర్ఎస్ నాయకులు సుదర్శన్, కోటయ్య తీర్మానులు కోరారు. బహిరంగ సభకు సంబంధించిన వాల్ రైటింగ్‌ను వారు ఆదివారం ప్రారంభించారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో వాల్ రైటింగ్స్ రాయించి.. సభకు తరలిరావాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో నర్సింహులు, తిరుపయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కంపచెట్లలోకి దూసుకెళ్లిన కారు

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), ఏప్రిల్ 20 : అతివేగంతో వెళుతున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన కంప చెట్లలోకి దూసుకెళ్లిన ఘటన ఆదివారం కౌకుంట్ల మండల కేంద్రానికి సమీపంలో చోటు చేసుకున్నది. బాధితుల కథనం మేరకు ఆదివారం ఉదయం ఆత్మకూరు గ్రామానికి చెందిన ఓ కుటుంబం అక్కడి నుంచి మరికల్‌లో ఓ శుభకార్యానికి వెళ్లారు. సాయంకాలం తమ గ్రామానికి తిరిగి వెళ్తుండగా, కౌకుంట్ల గ్రామ శివారులో కారు ఒక్కసారిగా అదుపు తప్పి కంప చెట్లలోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న ఏర్ బ్యాగులు తెరుచుకోగా కారులో ఉన్న ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. గమనించిన స్థానికులు వెళ్లి కారులో ఉన్న వారిని కౌకుంట్లలో ప్రథమ చికిత్స చేయించారు. కారులో మొత్తం నలుగురు అమ్మాయిలు, డ్రైవర్ ఉన్నారు.

టిప్పర్, ఆటో ఢీ : ఆటో డ్రైవర్ మృతి

మహ్మదాబాద్, ఏప్రిల్ 20 : ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన మహ్మదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై శేఖర్ రెడ్డి కథనం మేరకు నంచర్ల గేట్ ముకర్లబాద్ మధ్యలో మహ్మదాబాద్ నుంచి వస్తున్న ఆటో కోస్గి వైపు వెళ్తున్న టిప్పర్ ఢీ కొనడంతో హన్వాడ మండలం ఎల్లంబవి తండాకు చెందిన ఆటో డ్రైవర్ కాట్రావత్ సునీల్‌కుమార్ గాయాలతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలి

- పీయూ అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రకిరణ్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 20 : జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని పాలమూరు యూనివర్సిటీ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్ విద్యార్థులకు సూచించారు. ఆదివారం పీయూ పీజీ కళాశాల సెమినార్ హాల్‌లో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు నాలుగో సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై సరస్వతిదేవీ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెమిస్ట్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. రీసెర్చ్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలన్నారు. అందరికంటే భిన్నంగా ఆలోచించి జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆటపాటలతో కేరింతలతో వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తులతో గురువందనం చేశారు. కార్యక్రమాల్లో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ శేకుంటి రవికుమార్, రామ్మోహన్, శ్రీధర్‌రెడ్డి, సిద్ధరామ గౌడ్ రామరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జ్ఞానేశ్వర్, ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపాల్ రవికాంత్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి

హన్వాడ : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మద్దూర్, ఏప్రిల్ 20 : మండల కేంద్రంలోని షాగార్డెన్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో వరంగల్‌లో ఈనెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను అదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగా సభకు మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చి సభను దిగ్విజయం చేయాలని కోరారు.

హన్వాడలో..

హన్వాడ, ఏప్రిల్ 20 : మండలంలోని తిరుమల గిరిలో బీఆర్ఎస్ నాయకులు ఈ27న జరిగే రజతోత్సవ సభకు సంబంధిత వాల్ పోస్టర్‌ను అదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బాలకిష్టయ్య మాట్లాడుతూ రజతోత్సవ సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలను తరలిచ్చేందుకు కార్యకర్తలు పని చేయాలన్నారు. కార్యక్రమంలో రాములయ్య, వెంకటయ్య, బుచ్చన్న, బాలయ్య ఉన్నారు.

మద్దూర్ : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేస్తోంది

పుస్తకావిష్కరణ చేసిన ప్రొఫెసర్ హరగోపాల్

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 20 : సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేస్తోందని, ప్రతి ఒక్కరూ సాహిత్యంపై అధ్యాయనం చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. పాలమూర్ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జడ్చర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాహిత్యకారుడు ఉదయ మిత్ర అనువాదం చేసిన సొంతూరు, అలివివల పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాహిత్యకారుడు ఉదయ మిత్ర రచనలు సమాజంపై లోతైన ప్రభావం చేస్తాయన్నారు. సాహిత్య అభిమానులతో పాటు ప్రజలందరూ ఉదయ మిత్ర సాహిత్య పుస్తకాలను చదవాలని కోరారు. కార్యక్రమంలో పుస్తక రచయిత యాదగిరి అలియాస్ ఉదయమిత్ర, పాలమూర్ అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘావాచారి, వెంకట్రాములు, సతీశ్, సుభాషిణి, నారాయణ, ఖలీల్, శ్రీదేవి, తిమ్మప్ప, వెంకట్రాములు, చాంద్‌ఖాన్, నర్సింహులు, విశ్వనాథం, నిరంజన్, జనార్దన్, లక్ష్మణ్‌గౌడ్, ఖాజా మైనోద్దీన్, నయీం మొయ్దీన్ పాల్గొన్నారు.

సజావుగా ప్రారంభమైన ఓపెన్ స్కూల్ పరీక్షలు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 20 : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పది, ఇంటర్ పరీక్షలు ఆదివారం నుంచి జిల్లాలో సజావుగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 10వ తరగతి పరీక్షకు ఉదయం 401 మంది విద్యార్థులకూ 351 మంది హాజరయ్యారు. ఇంటర్ పరీక్షకు 694 మందికి 623 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ఇంటర్ పరీక్షలకు 27 మందికి గానూ 25 మంది హాజరయ్యారు. కేంద్రాలను డీఈవో ప్రవీణ్‌కుమార్, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శివయ్య పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలని అధికారులు, సిబ్బందికి సూచించారు.

చిరుతల వేట తీవ్రతరం

నవాబ్‌పేట, ఏప్రిల్ 20 : మండలంలోని యన్మన్‌గండ్ల గ్రామ శివారులో గల దేవర గుట్టపై పది రోజులుగా హల్‌చల్ చేస్తున్న చిరుతలను బంధించేందుకు అటవీ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. పది రోజుల నుంచి దేవరగుట్టలో రెండు చిరుతలు సంచరిస్తుండటంతో చుట్టు పక్కల పొలాల రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ క్రమంలో రైతుల వినతి మేరకు అటవీ అధికారులు మూడు రోజుల కిందట దేవర గుట్టలో సీసీ కెమెరాలు, బోన్ ఏర్పాటు చేసి, చిరుతలను బంధించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆదివారం అటవీ రేంజర్ వెంకటేశ్‌తోపాటు మరో ఆరుగురు అటవీ సిబ్బంది చిరుత కదలికలను గమనిస్తూ పహరా కాశారు. కాగా ఆదివారం ఓ చిరుత రోజూ కన్పించే స్థలంలో కాకుండా గుట్టపై భాగాన దర్శనమిచ్చింది. ఈ విషయమై అటవీ అధికారులను వివరణ కోరగా.. చిరుతలను బంధించేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నట్లు వివరించారు.

దేవరగుట్టపై స్థానికులతో మాట్లాడుతున్న అటవీ అధికారి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మహ్మదాబాద్, ఏప్రిల్ 20 : మండలంలోని ముందలితండా, లింగాయపల్లి పంచాయతీల్లో ఆదివారం సింగిల్ విండో చైర్మన్ లక్ష్మినారాయణ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యంను విక్రయించాలన్నారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నారాయణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్లు విష్ణుగోవర్ధన్‌రెడ్డి, శాంతి, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, ఆశన్న పాల్గొన్నారు.

పేరు తీసుకురావాలి

నారాయణపేట, ఏప్రిల్ 20 : ప్రజలకు మెరుగైన సేవలు అందించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని హోంగార్డు ఇన్‌చార్జి ఆఫీసర్ ఆర్ఎస్సై మద్దయ్య అన్నారు. పేట జిల్లాలో విధులు నిర్వహించి మహబూబ్‌నగర్‌కు బదిలీపై వెలుతున్న మొత్తం 61 మంది హోంగార్డులకు ఆదివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సమావేశం చేపట్టారు.

అడ్డాకులలో గాలివాన

- తడిసిన ధాన్యం, పరిశీలించిన తాసీల్దార్

మూసాపేట(అడ్డాకుల), ఏప్రిల్ 20 : అడ్డాకుల మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు బలీదుపల్లిలోని పాడి రైతు రాంరెడ్డికి చెందిన ఆవుల షెడ్డు కూలిపోయింది. బలీదుపల్లితో పాటు వర్నే, కన్మనూరు, ముత్యాలంపల్లి తదితర గ్రామాల్లో వర్షానికి వరి ధాన్యం తడిసింది. ఈ విషయం స్థానికులు తాసీల్దార్‌కు సమాచారం ఇవ్వడంతో తాసీల్దార్ శేఖర్ సిబ్బందితోపాటు కలిసి కూలిన ఆవుల షెడ్డును పరిశీలించారు. అక్కడ గాయపడిన 6 ఆవులను, దూడలను తాసీల్దార్ పరిశీలించారు. అదేవిధంగా తడిసిన వరి ధాన్యంను పరిశీలించారు. నష్టంపై ఉన్న తాధికారులకు నివేధిస్తానని తాసీల్దార్ తెలిపారు.

డాక్టరేట్ అందుకున్న లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 20 : లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ పాస్ట్ గవర్నర్ హరినారాయణ భట్టడ్‌కు ఆదివారం గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. గత 40 ఏళ్లుగా చేపడుతున్న సామాజిక కార్యక్రమాలు గుర్తింపుగా అమెరికా బార్లింగ్ టన్ యూనివర్సిటీ వారు న్యూఢిల్లీలోని గుల్ మహల్ కన్వెన్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో హరినారాయణ భట్టడ్‌కు డాక్టరేట్ అందజేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్/హన్వాడ/మూసాపేట(అడ్డాకుల)/మహబూబ్‌నగర్, ఏప్రిల్ 20 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూ మోతీనగర్‌లో ఆదిత్య స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1993 నుంచి 2024 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యా సంవత్సరం విద్యార్థులతో కలిసి అనాటి నుంచి నేటి వరకు చదువు చెబుతున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులను సన్మానించారు. అదేవిధంగా వీరన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2004-2005లో పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అలాగే హన్వాడ మండల కేంద్రంలో జిల్లా ఉన్నత పాఠశాలలో ఆదివారం 2007-2008 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని చేపట్టారు. అడ్డాకుల మండలంలోని శాఖాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2002 - 03 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు పూర్వ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. మూసాపేట మండలం జానంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2006 - 07బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరుపుకొన్నారు. కోయిలకొండ మండలంలోని గార్లపహాడ్ గ్రామంలోని 2004-2005 బ్యాచ్ పదో తరగతి వరకు చదువుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గెటుగేదర్ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ఆదిత్య స్కూల్ కరస్పాండెంట్ ఎన్. ప్రభాకర్, రుక్మిణి, మహేందర్, నరేందర్, జగదీశ్వర్, కొండయ్య, వీరేశ్, మహ్మద్ ఇంతియాజ్, యాదవకుమార్, విజయలక్ష్మి, భార్గవి, యాదయ్య, అజయ్‌కుమార్, పూర్వ ఉపాధ్యాయులు శ్రీశైలం, నాగేందర్, రామలింగయ్య, బాబు, సాయినాథ్, డాక్యానాయక్, అన్నపూర్ణ, అంతిరామ్, రమేశ్, నాగరాజు, మాజీ ఎంపీటీసీ కల్పన, అంజి, కళావతి, గోవిందమ్మ, సరోజ, నరేశ్, మనిల్, రాజుగౌడ్, గోవర్ధన్, శ్రీను, నాగరాజ్, యాదయ్య, నరేందర్, శివకుమార్, రామచంద్రయ్య, శ్రీధర్, విద్యావతి, జయన్నగౌడ్, లావణ్య, కృష్ణవేణి, విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, పూర్వ అధ్యాపకులు జానకిరామ్‌రెడ్డి, సిద్దిలింగం, రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, కృష్ణ, రవికుమార్, విజయలక్ష్మి, ఉషారాణి, రమేశ్ గౌడ్, పులేందర్, శివరాజు, కిరణ్, ఉపాధ్యాయులు హన్మంతరావు, రవీందర్, అరుణ, కృష్ణారెడ్డి, రాములు, బాలకిష్టప్ప పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ : పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న పదో తరగతి పూర్వ విద్యార్థులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : ఆత్మీయ సమ్మేళనంలో 2004-2005బ్యాచ్ పూర్వ విద్యార్థులు

హన్వాడ : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మూసాపేట(అడ్డాకుల) : శాఖాపూర్‌లో పూర్వ విద్యార్థులు

మూసాపేట : జానంపేటలో..